

2, 3 తేదీల్లో చాపరాయి ప్రవేశం బంద్

డుంబ్రిగుడ, డిసెంబరు 31: పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు గాను జనవరి 2, 3 తేదీల్లో పర్యాటకుల ప్రవేశం నిలుపుదల చేస్తున్నట్టు ఐటీడీఏ టూరిజం కో-ఆర్డినేటర్ మురళి, చాపరాయి జలపాతం సూపర్‌వైజర్ అప్పారావు తెలిపారు. ఆది వారం వారు విలేకరులతో మాట్లాడుతూ జలపాతంలో సుందరీకరణ పనులు చేపట్టి త్వరలోనే ప్రారంభించనున్న నేపథ్యంలో పారిశుధ్య పనులు చేపట్టడానికి రెండు రోజులు పడుతుందన్నారు. ఆ రెండు రోజులు పర్యాటకుల ప్రవేశానికి అనుమతి ఇవ్వడం లేదన్నారు.

న్యూ ఇయర్ జోష్

మన్యానికి పోటెత్తిన పర్యాటకులు

- అరకులోయ గిరిజన మ్యూజియంలో నూతన సంవత్సర వేడుకలు
- వివిధ కార్యక్రమాలు నిర్వహించడంతో సందడి
- బొర్రా గుహలు నుంచి లంబసింగి వరకు రద్దీ

(ఆంధ్రజ్యోతి- పాడేరు, న్యూస్ నెట్‌వర్క్)

మన్యంలో ఆదివారం న్యూఇయర్ జోష్ కనిపించింది. ఏడాది ముగింపు నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో పర్యాటకులు ఏజెన్సీకి తరలివచ్చారు. అన్ని పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం సందర్శకుల సందడి కనిపించింది. ఏడాది చివరి రోజు కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి ఏజెన్సీకి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. మన్యం అందాలకు ఫిదా అయ్యారు. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు పర్యాటకుల హడావిడి కనిపించింది. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, గిరి గ్రామదర్శిని, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి గెడ్డ, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, చెరువువేనం మేఘాల కొండ, లంబసింగి, యర్రవరం జలపాతం ప్రాంతాలను అధిక సంఖ్యలో సందర్శకులు తిలకించారు. 2023కి వీడ్కోలు... 2024కు స్వాగతం పలుకుతూ ఎంజాయ్ చేశారు.





అరకులోయ గిరిజన మ్యూజియం ప్రాంగణంలో న్యూ ఇయర్ సంబరాల్లో భాగంగా థింసా నృత్యం చేస్తున్న కళాకారులు



రద్దీగా ఉన్న కొత్తపల్లి జలపాతం

వంజంగి మేఘాల కొండ వద్ద..

పాడేరు రూరల్: మండలంలోని వంజంగి మేఘాల కొండ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. డిసెంబరు 31, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వేలాది మంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. పాల సముద్రాన్ని తలపించే మంచు మేఘాలు, సూర్యోదయ సమయంలో భానుడి కిరణాలకు పర్యాటకులు మంత్రముగ్ధులయ్యారు. వంజంగి మేఘాల కొండకు అధిక సంఖ్యలో పర్యాటకులు రావడంతో పాడేరులో రద్దీ నెలకొంది.

అరకులోయలో..

అరకులోయ: గిరిజన మ్యూజియం ప్రాంగణంలో ఉన్న కళా వేదికలో ఆదివారం రాత్రి థింసా నృత్యాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, లేజర్ షో, మ్యూజిక్ షో, మిమిక్రీ, మేజిక్ షో నిర్వహించారు. ఆదివారం రాత్రి 7 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు మ్యూజియం లోపల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పర్యాటకులు ఎంజాయ్ చేశారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ బాణసంచా పేల్చడంతో కేరింతలు కొట్టారు. న్యూఇయర్ సంబరాలకు స్థానికులతో పాటు పర్యాటకుల నుంచి విశేష ఆదరణ లభించిందని ఐటీడీఏ టూరిజం సెల్ మేనేజర్ మురళి తెలిపారు. ఈ వేడుకల్లో ఐటీడీఏ పీవో అభిషేక్ పాల్గొన్నారు.

లంబసింగిలో..

చింతపల్లి: ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి పర్యాటకులు పోటెత్తారు. కొంత మంది పర్యాటకులు ముందు రోజే లంబసింగికి చేరుకోగా ఎక్కువ మంది ఉదయం ఐదు గంటలకు ఇక్కడకు చేరుకున్నారు. దీంతో లంబసింగి, చెరువులవేనం, తాజంగి జలాశయం పర్యాటకులతో ఉదయం నుంచే సందడి నెలకొన్నది. చెరువులవేనం వ్యూపాయింట్ వద్దకు వేల సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. శ్వేత వర్ణంలో మేఘాలు అడవులను తాకుతూ పయనిస్తుంటే ప్రకృతి అందాలను కెమెరాలో బంధించేందుకు పర్యాటకులు పోటీ పడ్డారు. అలాగే ఎర్రవరం జలపాతానికి కూడా భారీ సంఖ్యలో పర్యాటకులు వచ్చారు.

కొత్తపల్లి జలపాతం వద్ద..

జి.మాడుగుల: ప్రముఖ పర్యాటక ప్రాంతం కొత్తపల్లి జలపాతం ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా కనిపించింది. డిసెంబరు 31 కావడంతో భారీ సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కుటుంబ సమేతంగా జలపాతానికి పర్యాటకులు వచ్చి రోజంతా సందడిగా గడిపారు. ఉదయం నుంచే సందర్శకుల తాకిడి పెరగడం వల్ల పార్కింగ్ స్థలం సైతం వాహనాలతో రద్దీగా మారింది.

చాపరాయి వద్ద...

డుంబ్రిగుడ: మండలంలోని చాపరాయి జలవిహారిలో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. సందర్శకులతో జలపాతం కిక్కిరిసి పోయింది. పర్యాటకులు జలపాతంలో జలకాలాడుతూ ఆనందంగా గడిపారు. చాపరాయి జలపాతం రోడ్డుకు అనుకుని వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.



అరకులోయ గిరిజన మ్యూజియంలో న్యూ ఇయర్ సంబరాల్లో పాల్గొన్న పర్యాటకులు

తగ్గని చలి తీవ్రత

పాడేరులో 13.9, అరకులోయలో 14, చింతపల్లిలో 14.5 డిగ్రీలు



ముంచంగిపుట్టులో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో దట్టంగా కురుస్తున్న పొగ మంచు

పాడేరు/చింతపల్లి/అరకులోయ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ఆదివారం కనిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త పెరిగినప్పటికీ చలి ప్రభావం ఏ మాత్రం తగ్గలేదు. పాడేరులో 13.9, అరకులోయలో 14, చింతపల్లిలో 14.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఆదివారం నమోదయ్యాయి. గత ఐదు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త పెరిగినా చలి మాత్రం స్థిరంగా ఉంటున్నది. ప్రస్తుత శీతాకాలం కావడంతో పాటు ఉత్తరాది నుంచి చలిగాలులు వీస్తుండడమే అందుకు కారణమని వాతావరణ శాఖ పేర్కొంటున్నది. ఫలితంగా మన్యంలో చలి తీవ్ర కొనసాగుతున్నది. ఏజెన్సీలో తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు దట్టంగా పొగ మంచు కమ్మేస్తుంది. దీంతో లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా చలి వేస్తుండగా, రాత్రి వేళల్లో తీవ్రత అధికంగా ఉంటున్నది. దీంతో మన్యంవాసులు చలి మంటలు కాగుతూ, ఉన్ని దుస్తులు ధరిస్తూ చలి నుంచి రక్షణ పొందుతున్నారు.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండలంలో ఆదివారం ఉదయం పది గంటలు దాటినా సూర్యుడు కనిపించలేదు. ఉదయం తొమ్మిది గంటలు దాటినా మంచు దట్టంగా కురిసింది. సాయంత్రం 4 గంటల నుంచే చలి మొదలవుతోంది. దీంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో ఎక్కడ చూసినా చలి మంటలు దర్శనమిస్తున్నాయి.



పాడేరులో ఆదివారం ఉదయం పొగ మంచు

దీవెన ఆలస్యం

విద్యార్థులు, తల్లిదండ్రుల అవస్థలు

విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 'జగనన్న విద్యాదీవెన' పథకం కింద ఏడాదికి నాలుగు విడతలుగా చెల్లించాల్సిన ఫీజులను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కళాశాలలకు నేరుగా ఫీజులు చెల్లించినప్పుడు తమకు ఎటువంటి సమస్యా ఉండేది కాదని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త విధానం తీసుకురావడంతో కష్టాలు మొదలయ్యాయని వాపోతున్నారు.

- ఏడాది ఫీజు నాలుగు విడతల్లో తల్లుల ఖాతాలో జమ చేస్తామని ప్రకటించిన వైసీపీ ప్రభుత్వం
- ప్రతిసారీ జాప్యమే
- గత విద్యా సంవత్సరం చివరి విడత నిధుల విడుదలకు రెండు రోజుల క్రితం బటన్ నొక్కిన సీఎం
- ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలైనా ఇప్పటివరకూ ఒక్క విడత కూడా విడుదల చేయని వైనం
- ప్రభుత్వం ఇచ్చేంత వరకూ తాము ఆగబోమంటున్న కొన్ని కళాశాలల యాజమాన్యాలు
- ఫీజుల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులపై ఒత్తిడి
- అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్న పేరెంట్స్



గతంలో ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను నేరుగా కాలేజీలకు చెల్లిస్తుండేవి. అయితే వైసీపీ ప్రభుత్వం 'జగనన్న విద్యా దీవెన' పేరుతో నాలుగు విడతలుగా విద్యార్థుల తల్లుల అకౌంట్లలో జమ చేస్తామని ప్రకటించింది. ఆ డబ్బులను తీసుకువెళ్లి కళాశాలలకు చెల్లించాలని సూచించింది. 2020-21 విద్యా సంవత్సరం నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే మొదటి ఏడాదిలోనే విద్యార్థులకు చుక్కలు చూపించింది. కొవిడ్ వల్ల తరగతులు జరగలేదన్న కారణాన్ని చూపించి నాలుగో క్వార్టర్ మొత్తాన్ని ఎగ్గొట్టింది. కానీ అనేక కాలేజీలు విద్యార్థులపై ఒత్తిడి పెట్టి ఫీజులను కట్టించుకున్నాయి. ఆ పెండింగ్ మొత్తాన్ని చెల్లిస్తే గానీ విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదు.

వాయిదాల పర్వంతో ఇబ్బందులు

ప్రతి మూడు నెలలకొకసారి ప్రభుత్వం ఫీజు డబ్బులు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేయాల్సి ఉంది. అయితే ఒక్కసారి కూడా ప్రభుత్వం సకాలంలో విడుదల చేయలేదు. ఆ విషయం కళాశాలలకు కూడా తెలుసు. అయినప్పటికీ పలు కళాశాలలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకువచ్చి ముందుగానే ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఒక్కోసారి సీఎం బటన్ నొక్కిన నెలకు గానీ విద్యార్థుల తల్లుల అకౌంట్లలో డబ్బులు జమ కావడం లేదు. ఈలోగా మరో మూడు నెలలు పూర్తయిపోతోంది. ఇలా ఏడాదిలో మూడు విడతలు ఆలస్యంగా డబ్బులు విడుదల చేస్తున్న ప్రభుత్వం...నాలుగో క్వార్టర్ ఫీజును పెండింగ్‌లో పెడుతోంది. దానిని మరుసటి ఏడాది విద్యా సంవత్సరంలో విడుదల చేస్తోంది. తాజాగా శుక్రవారం సీఎం జగన్మోహన్‌రెడ్డి విడుదల చేసింది గడిచిన విద్యా సంవత్సరానికి సంబంధించినది కావడం గమనార్హం. 2022-23 విద్యా సంవత్సరం మార్చి-ఏప్రిల్ త్రైమాసికానికి సంబంధించి విడుదల చేయాల్సిన మొత్తాన్ని సీఎం విడుదల చేశారు. అంటే, సుమారు ఏడు నెలలు ఆలస్యంగా ఫీజు మొత్తాలను విడుదల చేశారు. గత ఏడాది ఫైనలియర్ విద్యార్థులు క్యాంపస్‌లు నుంచి కూడా వెళ్లిపోయారు. ఆయా క్వార్టర్లకు సంబంధించిన ఫీజులను విద్యార్థులు ఎప్పుడో చెల్లించేశారు. కానీ, సీఎం జగన్మోహన్‌రెడ్డి మాత్రం వచ్చే ఏడాది ఇవ్వాల్సిన మొత్తాన్ని ఇప్పుడే ఇస్తున్నట్టు కలరింగ్ ఇస్తూ బహిరంగ సభను ఏర్పాటుచేసి మరీ బటన్ నొక్కారు.

మొదటి క్వార్టర్ ఎప్పుడు..?

ఇకపోతే, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి (జూలై-సెప్టెంబరు) క్వార్టర్‌కు సంబంధించిన ఫీజులను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. గత విద్యా సంవత్సరం నాలుగో విడత క్వార్టర్ ఫీజును ఏడు నెలలు ఆలస్యంగా ఇప్పుడు విడుదల చేసింది. మరి..ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి క్వార్టర్ ఎప్పుడు విడుదల చేస్తారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. మొదటి క్వార్టర్‌తో పాటు రెండో క్వార్టర్ కూడా పూర్తయిందని విద్యార్థులు చెబుతున్నారు. కాలేజీల నుంచి ఫీజులు చెల్లించాలని ఒత్తిడి ఉందని, ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికే అనేక కాలేజీలు విద్యార్థులపై ఒత్తిడి పెట్టి మొదటి, రెండు క్వార్టర్లకు సంబంధించిన ఫీజులను కట్టించుకున్నాయి.

వసతి దీవెన ఏదీ..?

ఫీజులను విద్యా దీవెన పేరుతో చెల్లిస్తున్న ప్రభుత్వం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను వసతి దీవెన కింద అందజేస్తామని ప్రకటించింది. డిగ్రీ, ఇంజనీరింగ్, ఇతర ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఏడాదికి రెండు విడతల్లో రూ.20 వేలు చెల్లిస్తామని పేర్కొంది. అయితే, గడిచిన మూడేళ్ల నుంచి ఒక్కసారి మాత్రమే రూ.పది వేలు చొప్పున అందిస్తోంది. ఒక్కో విద్యార్థి పది వేలు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏటా సుమారు 40 వేల మంది విద్యార్థులు పది వేల రూపాయల చొప్పున గడిచిన మూడేళ్ల నుంచి నష్టపోయారు. దీనిపై ఎవరిని అడిగినా ప్రయోజనం లేకపోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన ఇబ్బందులు ఉంటే సాంఘిక సంక్షేమ, బీసీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖలు అధికారులను కలిసి విన్నవించుకునేవారు. సాంఘిక సంక్షేమ శాఖ అనుసంధానంగా వ్యవహరించేది. కానీ, ఈ శాఖలను కూడా జగన్మోహన్‌రెడ్డి సర్కారు నిర్వీర్యం చేసింది. తమ చేతుల్లో ఏమీ లేదని, తామేమీ చేయలేమంటూ విద్యార్థులకు సదరు శాఖల అధికారులు చెబుతున్నారు.

మనోహరం.. మత్స్యగెడ్డ సోయగం

నీలాకాశంపై వెండి మబ్బులు దట్టంగా పరుచుకున్న వేళ.. మత్స్యగెడ్డ పాయల్లో వాటి ప్రతిబింబం కనిపిస్తూ మనోహరంగా కనిపించింది. మండలంలో గల సుజనకోట గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ పాయలు వద్ద ఆదివారం ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ అందాన్ని సందర్శకులు తమ కెమెరాల్లో బంధించారు. - ముంచంగిపుట్టు



రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మారేడుమిల్లి, డిసెంబరు 31: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. మారేడుమిల్లి ఏపీఆర్ గురుకుల జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న అడ్డతీగల మండలానికి చెందిన నేరం సత్యవరప్రసాద్(16) ఆదివారం రాత్రి స్నానం సబ్బు తెచ్చుకోవడం కోసం కాలేజీ బయట ఉన్న కిళ్లీషాపునకు వెళ్లి వస్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో కారు అతివేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో విద్యార్థి అపస్మారక స్థితికి చేరుకోగా, ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మృతి చెందాడు. దీనిపై మారేడుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమణ

సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్

పాడేరు రూరల్, డిసెంబరు 31: సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తామని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయరాజ్, అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. సమ్మెలో భాగంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెను నీరుగార్చేందుకు ప్రభుత్వంతో పాటు స్థానిక విద్యా శాఖాధికారులు ప్రయత్నిస్తున్నారన్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే సమ్మెలో ఉన్న ఉద్యోగులకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారని, భయపెట్టి విధుల్లోకి చేరేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన చెప్పారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగిన వేతనం చెల్లించాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మూడేళ్లుగా అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ ఎన్ని వినతులు అందించినా ఫలితం లేకపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు వి.జయరాజు, ఎం.అనీల్‌కుమార్, పి.సింహాచలం, గౌరీశంకర్, వెంకటరమణ దొర, సుభద్ర, అనంతలక్ష్మి, వివిధ మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

2.4 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయండి

జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలదేవ్, నాయకులు

అరకులోయ, డిసెంబరు 31: ప్రభుత్వం 2.4 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుపై శ్రద్ధ ఉంటే తక్షణమే ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా నిరుద్యోగులతో ఆటలాడుతున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదన్నారు. యువత డిమాండ్‌ను పక్కదోవ పట్టించాలనే ఆలోచనతోనే 'ఆడుదాం-ఆంధ్రా' పేరుతో పోటీలు నిర్వహిస్తున్నారని, దీనికి ఏమాత్రం స్పందన లేదని పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ బ్యాగ్‌లాగ్ పోస్టులు భర్తీచేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఆదివాసీల కోసం ప్రత్యే డీఎస్సీని ప్రకటించాలన్నారు. నిరుద్యోగ యువతీ, యువకుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. అరకులోయలో రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాల ఉన్నప్పటికీ, ఆరేళ్లుగా ఐటీడీఏకు చెందిన యువజన శిక్షణ కేంద్రం భవనంలోనే క్రీడా పాఠశాలను నిర్వహించడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజన బాలలకు గురుకుల క్రీడా పాఠశాల నిర్మించాలని, క్రీడా మైదానం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు బలరాం, అప్పారావు, బుజ్జిబాబు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ఘన సన్మానం



విశ్రాంత ఉపాధ్యాయుడ్ని సన్మానిస్తున్న సంఘం నేతలు

ముంచంగిపుట్టు, డిసెంబరు 31: మండల కేంద్రంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అంబిడి రామానుజులు మాట్లాడుతూ వివిధ శాఖల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులంతా కలసి సంఘంగా ఏర్పడడం ఆనందకరమన్నారు. విశ్రాంత ఉద్యోగులకు ఎటువంటి సమస్యలు వచ్చినా సంఘం దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సుబాస్‌చంద్ర, సంఘం నాయకులు జి.మోహనరావు, ఎస్.సన్యాసయ్య, వి.నీలకంఠం, రామచంద్రుడు పడాల్, జి.చిరంజీవి రావు తదితరులు పాల్గొన్నారు.

జన్‌మన్ పథకాన్ని వినియోగించుకోండి

జి.మాడుగుల, డిసెంబరు 31: ప్రధానమంత్రి జన్‌మన్ పథకాన్ని ఆదివాసీ కుటుంబీకులు సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ శాఖ ఏఈ డి.ఈశ్వరరావు సూచించారు. మండలంలోని గడుతూరు పంచాయతీ బర్సింగ్ మెట్ట గ్రామంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివాసీలతో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ పథకం ద్వారా నూతన ఇళ్ల నిర్మాణానికి రూ.2.3 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. దీనిలో భాగంగా మండల వ్యాప్తంగా 25 పీవీటీజీ గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. సర్వే బృందాలు సంబంధిత గ్రామాలకు వచ్చినప్పుడు లబ్ధిదారులు తప్పనిసరిగా అందుబాటులో ఉంటూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీవో కల్యాణం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆదివాసీ గ్రామాల్లో సర్వే

హుకుంపేట, డిసెంబరు 31: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన్‌మన్ పథకం లబ్ధిదారులను గుర్తించడానికి ఆదివాసీ గ్రామాల్లో సోమవారం నుంచి సర్వే నిర్వహిస్తామని హౌసింగ్ ఏఈ గౌరీశంకర్ తెలిపారు. మండలంలోని 33 పంచాయతీ పరిధిలో 360 గ్రామాల్లో పీవీటీజీ కుటుంబాలను గుర్తించడానికి వచ్చే నెల 14వ తేదీ వరకు సర్వే చేస్తామన్నారు. ఈ పథకంపై అవగాహన కల్పించుకుని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

చింతపల్లి డిసెంబరు 31: మండల కేంద్రంలో పలువురు నిరుపేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. నూతన సంవత్సరం, క్రిస్మస్‌ను పురస్కరించుకుని టీడీపీ చింతపల్లి మేజర్ పంచాయతీ అధ్యక్షుడు రీమలి ఆనంద్ ఈ కార్యక్రమం చేపట్టారు. 2024లో సకల జనులు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో నిర్వహించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సైకో పాలన పోయి సైకిల్ వస్తుంది

- టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, డిసెంబరు 31: కొత్త సంవత్సరంలో రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయని, సైకో పాలన పోయి సైకిల్ పాలన వస్తుందని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి చెప్పారు. ఆదివారం టీడీపీ శ్రేణులతో కలిసి చింతలవీధి పంచాయతీ తలారిసింగి గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారం చేపట్టాక చేపట్టే ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. అలాగే వైసీపీ పాలనలో జగన్ చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. నమ్మి ఓట్లేసిన వారంతా జగన్ పాలనలో రోడ్డు మీదకు వచ్చి ఆందోళనలు చేపట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ, జనసేన సంయుక్తంగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేపథ్యంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ శక్తికి వైసీపీ ప్రభుత్వం తుడిచుకుపోవడం ఖాయమని ఆమె జోస్యం చెప్పారు. అన్ని రంగాల ఉద్యోగులకు హామీలను గుప్పించిన జగన్‌రెడ్డి, వారిని నమ్మించి మోసగించారన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. కొత్తరోడ్లు వేయని జగన్ ప్రభుత్వం ఉన్న ప్రధాన రహదారుల్లో గోతులు పూడ్చలేని దుస్థితిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకులు రాజమండ్రి నారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, నాయకులు కేవీ.సురేష్‌కుమార్, అప్పల కొండ, పాటి.భీంబాబు తదితరులు పాల్గొన్నారు.



తలారిసింగిలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, నాయకులు

రాష్ట్ర స్థాయి పంచాయతీరాజ్ సదస్సును విజయవంతం చేయాలి

పాడేరు రూరల్, డిసెంబరు 31: విజయవాడలో ఈ నెల 3వ తేదీన నిర్వహించే రాష్ట్ర స్థాయి పంచాయతీరాజ్ సదస్సును విజయవంతం చేయాలని పీఆర్ చాంబర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా నాగరాజు కోరారు. బుధవారం సీకే కన్వర్షన్ హాలు మంగళగిరిలో నిర్వహించే ఈ సమావేశానికి పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ.రాజేంద్రప్రసాద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వానపల్లి లక్ష్మీ ముత్యాల రావు హాజరుకానున్నారన్నారు. రాష్ట్రంలో నిర్వీర్యమైన పంచాయతీ వ్యవస్థను రక్షించుకోవడానికి, హక్కుల కోసం జరగబోయే పోరాట సభకు పార్టీలకతీతంగా సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, మాజీ ప్రతినిధులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

కోడి పందేలు నిర్వహిస్తే సహించం

చింతపల్లి, డిసెంబరు 31: మండలంలోని కోడి పందేలు నిర్వహిస్తే సహించేది లేదని ఎస్ఐ అరుణ్‌కిరణ్ హెచ్చరించారు. మండలంలోని తాజంగి, లంబసింగి తదితర గ్రామాలను ఆదివారం సందర్శించారు. లంబసింగి, చెరువుల వేనం సమీపంలోని కోడి పందేల శిబిరాల్లో దాడులు చేసి 11 కోళ్లు, రూ.35,750 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వివరించారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

పాడేరు రూరల్, డిసెంబరు 31: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి మైదాన ప్రాంతం నుంచి వందలాది సంఖ్యలో వచ్చిన భక్తులతో పాటు ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకులతో ఆలయం రద్దీగా మారింది. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూకట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రసాద కమిటీ నిర్వహించిన ప్రసాద పంపిణీ, మోదకిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అదే విధంగా పాడేరు ఘాట్‌లోని అమ్మవారి పాదాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, మోదకిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్టు చైర్మన్ శివరాత్రి శ్రీనివాస్‌కుమార్, ప్రసాద కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, బీవీఎస్.ముకుందరావు, సిద్దినాతి కొండలరావు, దేముడు, పోతురాజు. ఆర్‌కే.రాజు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పాడేరులో నూతన సంవత్సర సందడి

- కళకళలాడుతున్న బొకే, పండ్లు, కేకుల దుకాణాలు

పాడేరు రూరల్, డిసెంబరు 31: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం ఉదయం నుంచే నూతన సంవత్సర సందడి ప్రారంభమైంది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు బొకేలు, పండ్లు, మిఠాయిలు, కేకులు కొనుగోలు చేసే వారితో దుకాణాలు రద్దీగా మారాయి. బొకేలు, పండ్ల ధరలు ఆకాశాన్ని అంటినప్పటికీ కొనుగోలుదారులు ఏమాత్రం వెనుకాడలేదు. సాధారణ రోజుల్లో కిలో కేక్ రూ.300 నుంచి రూ.350 అమ్మే వ్యాపారులు, ఆదివారం కిలో రూ.400 నుంచి రూ. 500వరకు అమ్మకాలను చేపట్టారు. ఇక బొకేలు, పండ్ల ధరలు గురించి చెబితే షాక్ తగిలేలా పెరిగిపోయాయి. వీటిని కూడా అధిక ధరలకే విక్రయించినా కొనుగోలుదారులు మాత్రం ఏమాత్రం వెనక్కి తగ్గలేదు.


కొనుగోలుదారులతో రద్దీగా మారిన కేకుల దుకాణం

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

పాడేరు రూరల్, డిసెంబరు 31: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని స్థానిక వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హేమలతదేవి, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని సూచించారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న నారీ శక్తి సమ్మేళనంలో భాగంగా ఆదివారం స్థానిక వీఆర్ ఫంక్షన్ హాలులో వెయ్యి మంది మహిళలతో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా సహకరిస్తున్న నేపథ్యంలో మహిళలు మరింత ముందుకు సాగాలని చెప్పారు. భారత సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను పిల్లలకు చిన్నప్పటి నుంచే నేర్పించాలని వారు కోరారు. సమ్మేళనం అనంతరం అయోధ్య నుంచి పాడేరుకు వచ్చిన అక్షింతలను గిరిజన సంప్రదాయ ధింసా నృత్యాలతో భారీ ఊరేగింపుగా మోదకొండమ్మవారి ఆలయానికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో నారీశక్తి సమ్మేళన జిల్లా ప్రతినిధి ఉజ్వల, జిల్లా ఆర్గనైజర్లు కురసా పార్వతమ్మ, డి.నారాయణమ్మ, ఎం.శాంతకుమారి, సత్యవతి, పద్మ, లక్ష్మి, వివిధ శాఖల్లో విధులు నిర్వహించే మహిళలు పాల్గొన్నారు.


మోదకొండమ్మ ఆలయానికి అయోధ్య అక్షింతలు తరలిస్తున్న మహిళలు

జోరుగా నిషేధిత గుట్కా తరలింపు

డుంబ్రిగుడ, డిసెంబరు 31: ఒడిశా రాష్ట్రం నుంచి మండలంలో నిషేధిత గుట్కాను గుట్కాను జోరుగా తరలిస్తున్నారు. ఒడిశా రాష్ట్రం నుంచి చటువా మీదుగా జైపూర్ రోడ్డు కూడలి ద్వారా గుట్కాను రవాణా చేస్తున్నారు. ఒడిశా నుంచి గుట్కాను దిగుమతి చేస్తూ ప్రైవేటు వ్యాపారులు బాగా సొమ్మును చేసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా విచ్చలవిడిగా గుట్కాను దుకాణాలను తరలిస్తూ లక్షలాది రూపాయల గుట్కా విక్రయాలు సాగిస్తున్నారు. మండలంలో రాత్రి వేళలో గుట్కాను తరలించి, పగటి వేళలో దర్జాగా విక్రయిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న గుట్కా తరలింపునకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని గిరిజనులు కోరుతున్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

పాడేరు రూరల్, డిసెంబరు 31: డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం నాటికి 20వ రోజుకు సమ్మె చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీరుమార్చుకొని అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు సైతం ప్రభుత్వానికి వంతపాడుతూ కేంద్రాలను తెరిపించి సచివాలయ సిబ్బందితో నిర్వహించాలని ప్రయత్నించడం అన్యాయమన్నారు. హామీలను అమలు చేయని జగన్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేదుకు అంగన్‌వాడీల సిద్ధం కావాలన్నారు. కాగా, ఆదివారం సమ్మె శిబిరం వద్ద గిరిజన సంప్రదాయ ధింసా నృత్యాన్ని చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, చిన్నారి, ఇందిర, జయ, విజయ, లక్ష్మి, కొండమ్మ, సత్యవతి కార్యకర్తలు పాల్గొన్నారు.


గిరిజన సంప్రదాయ ధింసా నృత్యం చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రమాదకరంగా కాకరపాడు వంతెన

- రక్షణ గోడలు లేకపోవడంతో వాహన చోదకుల భయాందోళన

కొయ్యూరు, డిసెంబరు 31: మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా పరిణమించింది. ఈ మార్గంలోని కాకరపాడు సమీపంలో కొండ వాగు ప్రవాహంపై నిర్మించిన వంతెనకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఈ వంతెన సమీపంలో ఇరువైపుల 'ఎస్' ఆకారంలో మలుపు ఉండడంతో పాటు పూర్తిగా డౌన్ కావడంతో వాహనాలు అదుపుతప్పి వాగులోకి దూసుకుపోతూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికే పలువురు వాహన చోదకులు ప్రమాదాల బారిన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ వంతెనకు రక్షణ గోడలు నిర్మించే విషయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడం విచారకరం. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ జేఈ ప్రసాద్‌ను వివరణ కోరగా, వంతెన నిర్మాణాలకు ఏడాది క్రితమే రూ.2.5 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. నిధులు త్వరలో మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. అయినప్పటికీ ప్రమాదాల నివారణకు తాత్కాలికంగా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.


రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా ఉన్న కాకరపాడు వంతెన